# అదీ కథ!

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 24-9-1990)

---

కథలు చదవటమే గాని రాయడం అలవాటు లేదు నాకు. కాని ఎందుకో ఇప్పుడు ఒకే ఒక్క కథ రాయాలని మహా కోరికగా ఉంది. అంతటి కోరిక కలగటానికి కారణం నాకు అతనిమీద ఏర్పడిన కసి, కోపం. అతనొక్కడి మీదనే కాదు అలాంటి వారందరి మీదా కోపం. అందుకే అతన్నీ అతని ప్రవృత్తినీ ఈసడించుకుంటూ అసహ్యం కలిగేటట్లు ఓ కథ రాసి ఎలాగోలా ఆ కథ అతనిచేత చదివించాలని విపరీతమైన పట్టుదల కలిగింది. ఆ పట్టుదల పెరిగి పెరిగి పంతంగా మారింది. అతనిమీద ఇలా ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది. అందుకే మొట్ట మొదటిసారిగా నేనూ ఓ కథ రాశాను.

ఎలాగయినా సరే ఈ కథ ఓ వార పత్రికలో ప్రచురణ కావాలి. అది అతని కంటపడాలి. అది చదివి, అతను సిగ్గుపడాలి. అంతేకాదు అతని మూలంగా నేను నష్టపోలేదని, పైగా లాభించానని అతనికి తెలియచెయ్యాలి. అప్పుడు కానీ నా కసి కొంతైనా తీరదు. నాకు జరిగిన అన్యాయానికీ, అవమానానికీ కొంతైనా ఉపశమనం కలగదు. స్త్రీల కథలు రాయటంలో నీకు కొంత అనుభవం ఉన్నది కాబట్టి ఈ కథ ఎలా మొదలుపెట్టాలో నేను చెప్పదలుచుకున్న విషయం ఏ రకంగా రాసి ఎలా ముగించాలో చెప్పు. ఇంకెప్పుడూ కథ రాయను. ఈ ఒక్కటే". సరసరాజు నన్ను అడిగిన తీరు ఆశ్చర్యంతోపాటు ఆసక్తిని కూడా కలిగించింది నాకు.

"ఏమిటీ నువ్వు కథ రాశావా ?" ఆసక్తి కనబరుస్తూ అడి

గాను నేను.

"అవును, నా ఆలోచనకూ, ఆవేశానికీ తగినట్లు ఇదిగో ఈ పత్రికవారు 'లంచం' అనే అంశంమీద కథల పోటీ పెట్టారు. ఈ కథ ఆ పోటీకి పంపించాలనుకుంటున్నాను. నా కథకు తప్పకుండా మొదటి బహుమతి లేదా కనీసం రెండో బహుమతి అయినా రావాలి. అప్పుడుగానీ నేను అతనికిచ్చిన లంచంకంటె ఎక్కువ సొమ్ము రాదు నాకు. అలా వస్తేనేతప్ప నేనతన్ని ఎదుర్కోలేను."

"నువ్వు ఎవరివయినా నాకు అనవసరం. మాకు ఇవ్వాల్సిన మామూలు మాకు ఇస్తేనేకానీ. నీ పని కాదు దాన్ని గురించి వేరే ఆలోచనలేం ఉండవు అంటూ లంచం కోసం డిమాండ్ చేస్తాడా ? అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఆడుకుంటాడా. కనీసపు మర్యాద కూడా కనపరచకుండా ఏమాత్రం పరిచయమూ లేని నన్ను ఏక వచన ప్రయోగం చేస్తాడా ? అసలు లంచం తీసుకోవడం వాడి జన్మహక్కులా మాట్లాడతాడా, నో....నేను సహించలేను. అతన్నే కాదు, తనలాంటి వారి నెవ్వరినీ సహించను. లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వటమూ అంతే నేరమే. కానీ ఎలా ? లంచం ఇవ్వకుండా అతను లంచగొండి అని నిరూపించలేను. ఇచ్చిన తర్వాత ఆ ప్రయత్నం చేస్తే నాదీ తప్పు అవుతుంది. ఐనా అధి కారుల అండదండలున్న అలాంటి వారికి శిక్ష వేయించడం, చట్ట ప్రకారం నేరస్తుడిగా నిరూపించడం అంత తేలిగ్గాదు. అతని మనసు మీద దెబ్బ కొట్టాలి అతని అంతరాత్మ అతన్ని హింసించాలి. అదీ....అదీ....నా కోరిక .. అందుకే ఈ ప్రయత్నం."

అతని ఆవేశాన్ని ఆలకిస్తూనే కథ చదవడం పూర్తి చేశాను.

"మొదటి ప్రయత్నమే అయినా చాలా చక్కగా వ్రాయగలి గావ్ రాజూ. కంగ్రాట్స్" అంటూ చేయి చాచాను.

"థ్యాంక్స్" అంటూ కరచాలనం చేశాడు రాజు

"నీ ఆవేదన నాకు అర్థం అయింది. నీవు ఎంతగా అవమానింపబడ్డావో, ఆ వ్యక్తి ఎంత అమానుషంగా, అక్రమంగా ప్రవర్తించాడో అర్థం అవుతూనే వుంది. కానీ .."

"సందేహించకుండా చెప్పు .... ఏమైనా మార్పులు చేర్పులు అవసరం అయితే తప్పకుండా చేద్దాం. అందుకే గదా నీకు చూపించింది"

"నో .. నో . ఆ అవసరం ఏమీ లేదు కథ, కథనం అన్నీ ఓ.కే. కానీ....ఈ కథ రాయటంతో నీ కోరిక తీరినట్లు కాదుకదా"

"అవును. నా కథకు బహుమతి రావాలి. అప్పుడు నేనే అతని దగ్గరకు వెళ్ళి ఈ కథ చదివించి, నీవు నా దగ్గర అక్రమంగా తీసుకున్న లంచానికి ప్రతిఫలంగా నాకు ఈ రూపంగా ఇదిగో ఇంత ముట్టింది అని చెప్పాలి. అంతేగాదు, అతను కథ చదివేటప్పుడు పడే కలవరపాటును కళ్ళారా చూసి ఆనందించాలి అంతే అతన్లో ఏమాత్రం పశ్చాత్తాపం కనపించినా చాలు అంతకంటే నేను ఏం కోరుకోను."

"కథయితే బాగానే రాశావు కానీ. మిగిలిన విషయాలన్నీ చాలా అమాయకంగా మాట్లాడుతున్నావ్ నరసరాజూ కేవలం కథలు చదివి, సినిమాలు చూసి మనుషులు పరివర్తన చెందుతారని, పశ్చాత్తాప పడతారని అనుకోవటం అమాయకత్వం."

"అతను మారతాడో, మారడో నాకు అనవసరం. నాకు కావలసింది, నేను కోరుకునేది ప్రతీకారం. అందుకు నాకు ఇంత కంటే వేరేమార్గం లేదు అంతే!" మొండిగా అన్నాడు వరసరాజు.

"సరే కథ బాగానే రాశావ్. పంపించు బహుమతి రావడానికి యోగ్యత వున్న కథగానే అనిపిస్తున్నది నాకు. కానీ సంపాదక

వర్గానికి నచ్చాలి కదా ! ఇంతకంటే బాగా రాసినవారూ పోటీకి పంపి ఉండవచ్చు. ఏది ఏమైనా విష్ యు ఆల్ ది బెస్ట్" అన్నాను. ఉత్సాహంగా కథ చేత పుచ్చుకుని వెళ్లిపోయాడు వరసరాజు.

★ ★ ★

"బాస్ నా కథకి రెండో బహుమతి వచ్చింది. అయామ్ వెరీ హేపీ. ఇదిగో ఇప్పుడే లెటర్ వచ్చింది" అమితోత్సాహంతో చెప్పేడు వరసరాజు.

"వెరిగుడ్....యూ డిజ్ఞర్వ్ ఇట్" అన్నాను సంతోషంగా

అతని సంతోషం అంతా తన మొదటి కథ ప్రచురణకు తీసుకోవటం, అదీ బహుమతి రావడం జరిగినందుకు కాదు, తన పంతం నెరవేరబోతున్నందుకు. మరో రెండు రోజుల్లో ఆ వార పత్రిక మార్కెట్‌లోకి వచ్చింది. వచ్చే సంచికలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన మూడు కథల్ని ప్రచురిస్తున్నామని, ఆ యా రచయిత (త్రు) లు తమ ఫోటో వెంటనే పంపమని ప్రచురించారు.

వెంటనే తన ఫోటోతో పాటు స్వపరిచయ వాక్యాలు క్లుప్తంగా వ్రాసి పంపాడు వరసరాజు. అతని ఉత్సాహం చూసి ముచ్చటేసింది నాకు.

"వచ్చే వారం ఆ వీక్లీ రాగానే నన్ను కూడా పిలు. నీతో పాటు నేనుకూడా అతని దగ్గరకు వస్తాను ఇప్పుడెందుకో నాక్కూడా అతన్ని చూడాలని అనిపిస్తున్నది" అన్నాను రాజుతో.

"తప్పకుండా వెళ్దాం. ఈ కథ నీ ఒక్కడికే కాదు. నీలాంటి వాళ్ళందరికీ నీలాంటి నీ మిత్రులందరికీ కూడా చూపించు. వాళ్ళ చేత కూడా చదివించు అని చెప్తాను. అసలు కథ చదివాక ఏ మాత్రమైనా సిగ్గుపడ్తాడో లేదో చూడాలి. అసలు అతని పేరు నాకు

తెలియదు. లేకపోతే కథలో ఆ పేరే వాడుకునేవాణ్ణి" నవ్వుతూ అన్నాడు నరసరాజు.

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. ఆ రోజు ఉదయాన్నే నరసరాజు మా ఇంటికి వచ్చి వీక్లీ ఎప్పుడు వస్తే అప్పుడు నా దగ్గరకు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

పన్నెండు గంటలప్పుడు పరుగెత్తుకుంటూ వీక్లీ వూపుకుంటూ ఆఫీసుకు వచ్చాడు నరసరాజు. అతని కథ పడిన పేజీ దగ్గర వేలుంచాడు నా దగ్గరకు రాగానే పుస్తకం తెరచి చూపించాడు. అతని ఫొటో, స్వపరిచయం కూడా వేశారు. నరసరాజు రచయిత అయినందుకు నాకు సంతోషంగా వుంటే తన కోరిక నెరవేరుతున్నదని అతను ఆనందపడిపోతున్నాడు. ఇద్దరం కలసి సదరు వ్యక్తి దగ్గరకు వెళ్ళాం.

మమ్మల్ని చూస్తూనే చూస్తున్న ఫైలుని మరింత సీరియస్‌గా, సిన్సియర్‌గా చూస్తున్నట్లు నటించాడు. బహుశా అతన్తో మళ్ళీ పని పడి వచ్చాం అనుకునుంటాడు పాపం.

"యక్స్యూజ్‌మీ ... మీతో కాసేపు మాట్లాడాలి" అన్నాడు నరసరాజు.

"మీపని కంప్లీట్ అయిందిగా" అనుమానంగా అన్నాడతడు.

"నో ...నో. దాన్ని గురించి కాదు. పర్సనల్ మేటర్" అన్నాను నేను కలుగచేసుకుని.

"చెప్పండి"

"మీకు కథలు, నవలలు చదివే అలవాటు వుండే వుంటుంది. ఒకవేళ లేకపోయినా ఇదిగో ఈ పుస్తకంలో అచ్చయిన నా మొదటి కథ మీరు తప్పక చదివి తీరాలి" అంటూ పుస్తకం తెరచి అతని ముందుంచాడు నరసరాజు.

"కంగ్రాట్స్. మీరూ రచయితన్నమాట" నవ్వుతూ అన్నాడతను.

"ఈ కథకి ప్రేరణ మీరే. మీ మూలంగా నాకు ఆర్థిక లాభం చేకూరింది. పైగా కథంతా మీ గురించే" వ్యంగ్యంగా అన్నాడు నరసరాజు.

అతని ముఖం గంభీరంగా మారిపోయింది. ఆసక్తిగా కథనంతా చదివాడు.

నరసరాజూ, నేనూ సిగరెట్ కాల్చుకుంటూ అతనివైపే పరిశీలనగా చూస్తూ కూర్చున్నాం.

"కథ చాలా బాగా రాశారు. బై ది బై నా పూర్తి పేరు ఇదే పుస్తకంలో ఈ కథల పోటీలో ప్రథమ బహుమతి గ్రహీతను నేనే. ఫొటో పంపే అలవాటు లేక పంపలేదు" నవ్వుతూ చెప్పాడు అతను.

కొయ్యబారిపోయాడు నరసరాజు.

— ० —